18-05-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్మృతి యాత్రలో ఉన్నట్లయితే మీ పాపాలు అంతమైపోతాయి, ఎందుకంటే స్మృతి అనేది ఖడ్గానికి పదును వంటిది, ఇందులో మిమ్మల్ని మీరు మోసగించుకోకండి"

ప్రశ్న:- పిల్లలు తమ క్యారెక్టర్ ను బాగు చేసుకునేందుకు తండ్రి ఏ మార్గాన్ని తెలియజేస్తారు?

జవాబు:- పిల్లలూ, మీ చార్టును సత్యాతి-సత్యముగా పెట్టండి. చార్టు పెట్టడం ద్వారానే క్యారెక్టర్లు బాగవుతాయి. స్వయాన్ని చూసుకోవాలి - మొత్తం రోజంతటిలో నా క్యారెక్టర్ ఎలా ఉంది? ఎవరికీ దుఃఖాన్ని అయితే ఇవ్వలేదు కదా? వ్యర్థమైన మాటలైతే మాట్లాడలేదు కదా? స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని ఎంత సమయం స్మృతి చేసాను? ఎంతమందిని నా సమానంగా తయారుచేసాను? ఈ విధంగా ఎవరైతే తమ లెక్కాపత్రాన్ని పెట్టుకుంటారో, వారి క్యారెక్టర్ బాగవుతూ ఉంటుంది. ఎవరైతే చేస్తారో వారే పొందుతారు, చేయకపోతే పశ్చాత్తాపపడతారు.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు, ఎందుకంటే వారు ఇక్కడ సమ్ముఖంగా ఉన్నారు. పిల్లలందరూ తమ స్వధర్మములోనే ఉంటూ తండ్రిని స్మృతి చేస్తూ ఉంటారని చెప్పలేము. తప్పకుండా బుద్ధి అటూ-ఇటూ వెళ్తూ ఉంటుంది. ఆ విషయములో ప్రతి ఒక్కరూ తమను తాము అర్థం చేసుకోగలరు. ముఖ్యమైన విషయము సతోప్రధానంగా అవ్వడము. అది కూడా స్మృతి యాత్ర ద్వారా తప్ప ఇంకే విధంగానూ అవ్వలేరు. బాబా ఉదయం యోగంలో కూర్చొని పిల్లలను లాగుతారు, ఆకర్షిస్తారు. నంబరువారుగా ఆకర్షిస్తూ ఉంటారు. స్మృతిలో శాంతిగా ఉంటారు, ప్రపంచాన్ని కూడా మర్చిపోతారు. కానీ ప్రశ్న ఏమిటంటే - మొత్తం రోజంతటిలో ఏం చేస్తారు? అదైతే ఉదయం వేళలో గంట, అరగంట యొక్క స్మృతియాత్ర, దాని ద్వారా ఆత్మ పవిత్రంగా అవుతుంది, ఆయుష్షు పెరుగుతుంది. కానీ రోజంతటిలో ఎంత స్మృతి చేస్తారు? ఎంతగా స్వదర్శన చక్రధారులుగా అవుతారు? అలాగని బాబాకైతే అన్నీ తెలుసని కాదు. మీ హృదయాన్ని మీరు ప్రశ్నించుకోవాలి - నేను మొత్తం రోజంతటిలో ఏమి చేసాను. ఇప్పుడు పిల్లలైన మీరు చార్ట్ వ్రాస్తారు. కొందరు కరెక్టుగా వ్రాస్తారు, కొందరు తప్పుగా వ్రాస్తారు. మేమైతే శివబాబాతో పాటే ఉన్నాము కదా, శివబాబానే స్మృతి చేస్తూ ఉన్నాము కదా అని భావిస్తారు. కానీ నిజంగా స్మృతిలో ఉన్నారా? పూర్తిగా సైలెన్స్ లో ఉండడం ద్వారా ఇక ఈ ప్రపంచాన్నే మర్చిపోతారు. మేమైతే శివబాబా స్మృతిలోనే ఉన్నామంటూ మిమ్మల్ని మీరు మోసగించుకోకూడదు. దేహపు సర్వ ధర్మాలను మర్చిపోవాలి. మనల్ని శివబాబా ఆకర్షించి మొత్తం ప్రపంచమంతటినీ మరపింపజేస్తారు. తండ్రి అర్థం చేయిస్తారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి అయితే ఆకర్షిస్తారు. ఆత్మలందరూ తండ్రిని స్మృతి చేయాలి, ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు. కాని నిజంగా స్మృతి ఉంటుందా లేదా అన్న విషయములో స్వయం లెక్కాపత్రాన్ని చూసుకోవాలి. ఎంతగా నేను బాబాను స్మృతి చేస్తున్నాను? ఎలాగైతే ప్రేయసీ-ప్రియుని ఉదాహరణ ఉంటుందో, అలా వీరు ఆత్మిక ప్రేయసీ-ప్రియులు. ఇక్కడి విషయాలు అతీతమైనవి. అవి దైహికమైనవి, ఇవి ఆత్మికమైనవి. మేము ఎంత సమయం దైవీ గుణాలలో ఉన్నాము? ఎంత సమయం బాబా సేవలో ఉన్నాము? అని మిమ్మల్ని మీరు చూసుకోవాలి. మళ్ళీ ఇతరులకు కూడా స్మృతిని కలిగించాలి. ఆత్మపై ఏదైతే తుప్పు పట్టి ఉందో, అది స్మృతి లేకుండానైతే తొలగదు. భక్తిలో అనేకులను స్మృతి చేస్తారు. ఇక్కడైతే ఒక్కరినే స్మృతి చేయాలి. ఆత్మ అయిన మనం ఒక చిన్నని బిందువు, అలాగే బాబా కూడా చిన్నని బిందువు. వారు చాలా-చాలా సూక్ష్మమైనవారు కానీ జ్ఞానము చాలా గొప్పది. శ్రీలక్ష్మి లేక శ్రీనారాయణునిగా అవ్వడము, విశ్వానికి యజమానులుగా అవ్వడమనేది అంత సులభమేమీ కాదు. తండ్రి అంటారు - స్వయాన్ని అన్నీ తెలిసినవారిగా భావిస్తూ స్వయాన్ని మోసగించుకోకండి. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి - తుప్పు వదలటానికి మొత్తం రోజంతటిలో నేను స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని ఎంతగా స్మృతి చేసాను? ఎంతమందిని నా సమానంగా తయారుచేసాను? ప్రతి ఒక్కరూ ఈ విషయాలలో తమ లెక్కాపత్రాన్ని పెట్టుకోవాలి. ఎవరైతే చేస్తారో, వారే పొందుతారు, చేయకపోతే పశ్చాత్తాపపడతారు. స్వయాన్ని చూసుకోవాలి - నా క్యారెక్టర్ మొత్తం రోజంతటిలో ఎలా ఉంది? ఎవరికీ దుఃఖాన్ని అయితే ఇవ్వలేదు కదా? వ్యర్థమైన మాటలైతే మాట్లాడలేదు కదా? చార్ట్ పెట్టుకోవడం ద్వారా క్యారెక్టర్ బాగవుతుంది. తండ్రి దారినైతే తెలియజేసారు.

ప్రేయసీ-ప్రియులు ఒకరినొకరు తలుచుకుంటూ ఉంటారు. తలుచుకోగానే వారు ఎదురుగా వచ్చేస్తారు. ఇరువురూ స్త్రీలే అయినా కూడా సాక్షాత్కారము జరగగలదు, ఇరువురూ పురుషులే అయినా కూడా సాక్షాత్కారం జరగగలదు. కొందరు

మిత్రులు తమ సోదరులతో కన్నా పరస్పరం ఎక్కువ స్నేహంగా ఉంటారు. మిత్రులకు పరస్పరం ఎంత ప్రేమ ఏర్పడుతుందంటే తమ సోదరుల పట్ల కూడా అంత ఉండదు. ఒకరినొకరు ఎంతో ప్రేమగా ముందుకు తీసుకువెళ్తూ ఉంటారు. బాబా అయితే అనుభవజ్ఞులు కదా. ఉదయంవేళ తండ్రి ఎక్కువగా ఆకర్షిస్తారు. వారు అయస్కాంతము, సదా పావనులు కావున వారు ఆకర్షిస్తారు. తండ్రైతే అనంతమైనవారు కదా. వీరు చాలా ప్రియమైన పిల్లలని భావిస్తారు. చాలా ఎక్కువ ఆకర్షిస్తారు. కానీ ఈ స్మృతియాత్ర చాలా అవసరము. ఎక్కడికి వెళ్ళినా, యాత్రలు చేసినా, లేస్తూ, కూర్చుంటూ, తింటూ స్మృతి చేయవచ్చు. ప్రేయసీ-ప్రియులు ఎక్కడున్నా కూడా తలచుకుంటారు కదా. ఇది కూడా అటువంటిదే. తండ్రిని స్మృతి అయితే చేయవలసిందే, లేకపోతే వికర్మలు ఎలా వినాశనమవుతాయి. ఇంకే ఉపాయము లేనే లేదు. ఇది చాలా సూక్ష్మమైనది. పదునైన ఖడ్గముపై నడవడం వంటిది. స్మృతియే ఖడ్గము యొక్క పదును. స్మృతిని మర్చిపోతున్నామని ఘడియ-ఘడియ అంటారు. దీనిని ఖడ్గము అని ఎందుకంటారు? ఎందుకంటే దీని ద్వారా పాపాలు అంతమవుతాయి, మీరు పావనంగా అవుతారు. ఇది చాలా నాజూకైనది. ఏ విధంగా వారు అగ్నిపై నుండి దాటి వెళ్తారో అలా మీ బుద్ధియోగము బాబా వైపుకు వెళ్ళిపోతుంది. తండ్రి ఇక్కడకు వచ్చారు, మనకు వారసత్వాన్ని ఇస్తారు, వారు పైన లేరు, ఇక్కడకు వచ్చారు. నేను సాధారణ తనువులోకి వస్తాను అని అంటారు. తండ్రి పై నుండి కిందకు వచ్చారని మీకు తెలుసు. చైతన్యమైన వజ్రము ఈ భరిణిలో కూర్చున్నారు. మేము బాబాతో పాటు కూర్చున్నామని కేవలం ఇందులోనే సంతోషపడిపోకూడదు. ఇది బాబాకు తెలుసు మరియు వారు ఎంతో ఆకర్షిస్తారు. కానీ ఇలా కేవలం అరగంటా, ముప్పావుగంటా ఉంటారు. మరి మిగిలిన రోజంతటినీ వృధాగా పోగొట్టుకుంటే దాని వలన లాభమేముంది. పిల్లలకు తమ చార్టు విషయములో చింత ఉండాలి. మేమైతే భాషణ చేయగలము కదా, చార్టు పెట్టాల్సిన అవసరం మాకేముంది అని భావించకండి! ఈ పొరపాటు చేయకండి. మహారథులు కూడా చార్టు పెట్టాలి. మహారథులు ఎక్కువమంది లేరు, చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు. చాలా మందికి నామ-రూపాలు మొదలైనవాటిలో ఎంతో సమయం వృధాగా పోతుంది. గమ్యము చాలా ఉన్నతమైనది. బాబా ఫలానా పాయింటును అర్థం చేయించలేదు అని విద్యార్థులు భావించకుండా ఉండేలా బాబా అంతా అర్థం చేయిస్తారు. స్మృతి మరియు సృష్టిచక్రపు జ్ఞానము ముఖ్యమైనవి. ఈ సృష్టిచక్రము యొక్క 84 జన్మల గురించైతే పిల్లలైన మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. వైరాగ్యము కూడా మీకే కలుగుతుంది. ఇప్పుడు ఈ మృత్యు లోకములో ఇక ఉండేది లేదని మీకు తెలుసు. తిరిగి వెళ్ళే కంటే ముందు పవిత్రంగా అవ్వాలి. దైవీ గుణాలు కూడా తప్పకుండా కావాలి. నంబరువారుగా మాలలో కూర్చబడతారు. ఆ తరువాత నంబరువారుగా రాజధానిలోకి వస్తారు. ఆ తరువాత నంబరువారుగా మీ పూజలు కూడా జరుగుతాయి. అనేకమంది దేవతలకు పూజలు జరుగుతాయి. ఏమేమి పేర్లు పెడతారు. చండికా దేవి మేళా కూడా జరుగుతుంది. ఎవరైతే రిజిస్టరు పెట్టరో వారు బాగుపడరు. అప్పుడిక - వీరు వినసే వినరు, ఒప్పుకోనే ఒప్పుకోరు, వీరైతే చండికలా ఉన్నారు అని అనడం జరుగుతుంది. ఇవి అనంతమైన విషయాలు. పురుషార్థం చేయకపోతే తండ్రి అంటారు - వీరైతే తండ్రి మాటను కూడా వినడం లేదు. వారి పదవి తగ్గిపోతుంది. అందుకే తండ్రి అంటారు - స్వయంపై స్వయం చాలా దృష్టిని ఉంచుకోవాలి. బాబా ఉదయాన్నే వచ్చి స్మృతియాత్ర విషయములో ఎంతగా కృషి చేయిస్తారు. ఇది చాలా భారీ గమ్యము. జ్ఞానాన్ని అయితే సులువైన సబ్జెక్టని అంటారు. 84 జన్మల చక్రాన్ని స్మృతి చేయడం పెద్ద విషయమేమీ కాదు. స్మృతియాత్రయే చాలా విలువైనది, అందులో ఎంతోమంది ఫెయిల్ కూడా అవుతారు. మీ యుద్ధము కూడా ఇందులోనే ఉంది. మీరు స్మృతి చేస్తారు, మాయ మిమ్మల్ని కింద పడేస్తుంది. జ్ఞానములో యుద్ధం యొక్క విషయమేదీ లేదు. అదైతే సంపాదనకు ఆధారము. ఇక్కడైతే పవిత్రంగా అవ్వాలి, అందుకే - మీరు వచ్చి పతితుల నుండి పావనులుగా చేయండి అని తండ్రిని పిలుస్తారు. అంతేకానీ మీరు వచ్చి చదివించండి అని పిలవరు. పావనంగా చేయండి అని పిలుస్తారు. కావున ఈ పాయింట్లన్నింటినీ బుద్ధిలో ఉంచుకోవాలి. పూర్తి రాజయోగులుగా అవ్వాలి.

జ్ఞానమైతే చాలా సహజమైనది. కేవలం యుక్తిగా అర్థం చేయించవలసి ఉంటుంది. మాటలో మాధుర్యం కూడా కావాలి. మీకు ఈ జ్ఞానము లభిస్తుంది. అది కూడా కర్మల అనుసారంగానే లభిస్తుందని అంటారు. ప్రారంభం నుండి భక్తిని చేసారు. మంచి కర్మలు చేసారు కావుననే శివబాబా కూడా మంచి రీతిలో కూర్చొని అర్థం చేయిస్తారు. ఎంత ఎక్కువ భక్తి చేసి ఉంటారో, శివబాబా సంతుష్టం అయి ఉంటారో, అంతగానే ఇప్పుడు కూడా జ్ఞానాన్ని త్వరగా తీసుకుంటారు. మహారథుల బుద్ధిలో పాయింట్లు ఉంటాయి. వ్రాస్తూ ఉండాలి, మంచి-మంచి పాయింట్లను వేరు చేస్తూ ఉండాలి. పాయింట్లను తూకం వేయాలి. కానీ ఎవ్వరూ ఈ విధమైన శ్రమను చేయరు. కష్టం మీద ఏ ఒక్కరో నోట్స్ పెట్టుకుంటూ ఉంటారు మరియు మంచి పాయింట్లను తీసి వేరుగా వ్రాస్తూ ఉంటారు. బాబా ఎల్లప్పుడూ చెప్తూ ఉంటారు - భాషణ చేసే కంటే ముందు మీరు వ్రాసుకోండి, ఆ తర్వాత చెక్ చేసుకోండి. ఇటువంటి శ్రమను చేయరు. అన్ని పాయింట్లు ఎవ్వరికీ గుర్తుండవు. బ్యారిస్టర్లు కూడా తమ డైరీలో పాయింట్లను నోట్ చేసుకుంటారు. మీకైతే ఇది ఎంతో అవసరము. టాపిక్స్ పై

వ్రాసుకుని, ఆ తర్వాత చదవాలి, కరెక్షన్ చేయాలి. ఇంత శ్రమ చేయకపోతే పైకెదగలేరు. మీ బుద్ధియోగము ఇతర వైపులకు భ్రమిస్తూ ఉంటుంది. సరళతతో నడుచుకునేవారు చాలా కొద్దిమందే ఉన్నారు. సేవ తప్ప ఇంకేదీ బుద్ధిలో ఉండదు. మాలలోకి రావాలంటే కష్టపడాలి. తండ్రి డైరెక్షన్ ఇస్తారు, అది హృదయానికి హత్తుకుంటుంది. స్మృతి ఉండకపోతే ఇక అది ఎవరికి వారికే తెలుస్తుంది. వ్యాపార-వ్యవహారాలు మొదలైనవి చేసుకోండి కానీ నోట్ చేసుకునేందుకు డైరీ అయితే సదా జేబులో ఉండాలి. అందరికన్నా ఎక్కువగా మీరు నోట్ చేసుకోవాలి. నిర్లక్ష్యంగా ఉంటే, నాకు అన్నీ తెలుసునని భావిస్తే మాయ కూడా తక్కువైనదేమీ కాదు, దెబ్బ వేస్తూ ఉంటుంది. లక్ష్మీ-నారాయణులుగా అవ్వడం అంత సులభమైన విషయమేమీ కాదు. పెద్ద రాజధాని స్థాపన అవుతోంది, కోట్లల్లో ఏ ఒక్కరో వెలువడుతారు. బాబా కూడా ఉదయం రెండు గంటలకు లేచి వ్రాసేవారు, మళ్ళీ చదివేవారు. పాయింట్లు మర్చిపోయేవారు, వాటిని మీకు అర్థం చేయించేందుకు మళ్ళీ కూర్చొని చూసుకునేవారు. దాని బట్టి స్మృతియాత్రలో ఎక్కడి వరకూ చేరుకున్నారు, కర్మాతీత అవస్థలో ఎక్కడి వరకు చేరుకున్నారు? అనేది అర్థం చేసుకోగలరు. ఊరికే ఎవ్వరినీ మహిమ చేయకూడదు. ఇందులో ఎంతో శ్రమ ఉంది, కర్మభోగం ఉంటుంది, స్మృతి చేయవలసి ఉంటుంది. అచ్ఛా, మురళిని బ్రహ్మా కాదు, శివబాబాయే వినిపిస్తున్నారని భావించండి. శివబాబాయే మీకు వినిపిస్తారు అని పిల్లలకు ఎల్లప్పుడూ అర్థం చేయించడం జరుగుతుంది. అప్పుడప్పుడూ మధ్యలో ఈ బిడ్డ కూడా మాట్లాడుతారు. తండ్రి అయితే పూర్తిగా ఏక్యురేట్ గానే చెప్తారు. ఇతనికైతే రోజంతా ఎన్నో ఆలోచనలు చేయవలసి ఉంటుంది. ఎంతోమంది పిల్లల యొక్క బాధ్యత ఉంది. పిల్లలు నామ-రూపాలలో చిక్కుకొని చంచలమవుతూ ఉంటారు. పిల్లల కొరకు ఇళ్ళు కట్టించాలి, ఈ ఏర్పాట్లు చేయాలి అంటూ అనేకమంది పిల్లల యొక్క ఆలోచనల ఉంటాయి. వాస్తవానికి ఇదంతా డ్రామా. బాబాది కూడా డ్రామాయే, ఇతనిది కూడా డ్రామాయే, అలాగే మీది కూడా డ్రామాయే. డ్రామాలో లేకుండా ఏదీ జరగదు. క్షణక్షణము డ్రామా నడుస్తూ ఉంటుంది. డ్రామాను స్మృతి చేయడం ద్వారా చలించకుండా ఉంటారు. అచంచలంగా, చలించకుండా, స్థిరంగా ఉంటారు. తుఫానులైతే ఎన్నో వస్తాయి. కొందరు పిల్లలు నిజం చెప్పరు, స్వప్నాలు కూడా ఎన్నో వస్తాయి. మాయ ఉంది కదా. ఎవరికైతే ఇంతకుముందు వచ్చేవి కావో వారికి కూడా వస్తాయి. బాబాకు అర్థమైపోతుంది. పిల్లలు వారసత్వాన్ని పొందేందుకు స్మృతిలో కష్టపడవలసి ఉంటుంది. కొందరు కష్టపడుతూ, కష్టపడుతూ అలసిపోతారు. గమ్యము చాలా పెద్దది. 21 తరాలకు విశ్వాధిపతులుగా తయారుచేస్తారు కావున అంతగా కష్టపడాలి కూడా కదా. ప్రియమైన తండ్రిని స్మృతి చేయవలసి ఉంటుంది. బాబా మమ్మల్ని విశ్వాధిపతులుగా తయారుచేస్తున్నారని హృదయంలో ఉంటుంది. అటువంటి తండ్రినైతే ఘడియ-ఘడియ స్మృతి చేయవలసి ఉంటుంది. అందరికంటే ప్రియమైనవారు బాబా. ఈ బాబా అయితే అద్భుతం చేస్తారు, విశ్వము యొక్క జ్ఞానాన్ని ఇస్తారు. బాబా, బాబా, బాబా అంటూ లోలోపల మహిమను గానం చేయవలసి ఉంటుంది. ఎవరైతే స్మృతి చేస్తారో వారికి బాబా పట్ల ఆకర్షణ కలుగుతూ ఉంటుంది. తండ్రి ద్వారా రిఫ్రెష్ అయ్యేందుకే ఇక్కడకు వస్తారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు - మధురమైన పిల్లలూ, పొరపాట్లు చేయకండి. బాబా చూస్తూ ఉంటారు, అన్ని సెంటర్ల నుండి పిల్లలు వస్తారు. వారిలో ఎటువంటి సంతోషం ఉందో గమనిస్తాను, వారిని అడుగుతాను, బాబా అయితే పరిశీలిస్తారు కదా. బాబా పట్ల ఎంత ప్రేమ ఉంది అన్నది ముఖం ద్వారా కూడా చూస్తారు. బాబా ఎదురుగా వస్తే బాబా ఆకర్షిస్తారు కూడా. ఇక్కడ కూర్చుని-కూర్చునే అంతా మర్చిపోతారు. బాబా తప్ప ఇంకేమీ లేదు. మొత్తం ప్రపంచమంతటినీ మర్చిపోవలసిందే. ఆ అవస్థ చాలా మధురంగా, అలౌకికంగా ఉంటుంది. బాబా స్మృతిలో వచ్చి కూర్చుంటే ప్రేమ అశ్రువులు కూడా వస్తాయి. భక్తి మార్గములో కూడా అశ్రువులు వస్తాయి. కానీ భక్తి మార్గము వేరు, జ్ఞాన మార్గము వేరు. ఇది సత్యమైన తండ్రిపై సత్యమైన ప్రేమ. ఇక్కడి విషయమే అతీతమైనది. ఇక్కడ మీరు శివబాబా వద్దకు వస్తారు, తప్పకుండా వారు రథములో వస్తారు కదా. శరీరము లేకుండా ఆత్మలు అక్కడ కలుసుకోగలవు, ఇక్కడైతే అందరూ శరీరధారులే. వీరు బాప్ దాదా అని మీకు తెలుసు. కావున తండ్రిని తప్పకుండా స్మృతి చేయవలసిందే. ఎంతో ప్రేమగా మహిమ చేయవలసి ఉంటుంది. బాబా మనకు ఏమిస్తున్నారు!

బాబా వచ్చారని, వారు మనల్ని ఈ అడవి నుండి తీసుకువెళ్తారని పిల్లలైన మీకు తెలుసు. మంగళం భగవాన్ విష్ణు అని అంటారు కదా. వారు అందరి మంగళం చేసేవారు, అందరి కళ్యాణమూ జరుగుతుంది. తండ్రి ఒక్కరే, కావున వారిని స్మృతి చేయాలి. మనం ఇతరుల కళ్యాణాన్ని ఎందుకు చేయలేము! తప్పకుండా ఏదో లోపం ఉంది. తండ్రి అంటారు, స్మృతి యొక్క పదును లేదు, అందుకే వాణిలో కూడా ఆకర్షణ ఉండటం లేదు. ఇది కూడా డ్రామాయే. ఇప్పుడిక పదునును బాగా ధారణ చేయండి. స్మృతియాత్రయే కష్టమైనది. మనము సోదరులకు జ్ఞానాన్ని ఇస్తాము. బాబా పరిచయాన్ని ఇస్తాము. తండ్రి నుండి వారసత్వాన్ని పొందాలి. ఘడియ-ఘడియ మర్చిపోతూ ఉండవచ్చని బాబాకు తెలుస్తుంది. తండ్రి అయితే అందరినీ పిల్లలుగా భావిస్తారు. అందుకే పిల్లలూ, పిల్లలూ అని అంటారు. వీరు అందరికీ

తండ్రి, వీరిది అద్భుతమైన పాత్ర కదా. ఈ మాటలు ఎవరివి అని చాలా కొద్దిమంది పిల్లలే అర్థం చేసుకుంటారు. బాబా అయితే పిల్లలూ, పిల్లలూ అనే అంటారు. పిల్లలకు వారసత్వాన్ని ఇవ్వడానికే నేను వచ్చాను. బాబా అంతా వినిపిస్తారు. నేను పిల్లలతో పని చేయించాలి కదా. ఇది చాలా అద్భుతమైన, రుచికరమైన జ్ఞానము. ఈ జ్ఞానం విచిత్రమైనది మరియు కఠినమైనది కూడా. వైకుంఠానికి యజమానులుగా అవ్వడానికి జ్ఞానము కూడా అటువంటిదే కావాలి కదా.

అచ్ఛా, ప్రతి ఒక్కరూ బాబాను స్మృతి చేయాలి, దైవీ గుణాలను ధారణ చేయాలి. నోటితో ఎప్పుడూ తప్పుడు మాటలను మాట్లాడకూడదు. ప్రేమతో పని కానివ్వాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఉదయముదయమే ఏకాంతములో కూర్చొని ప్రేమగా తండ్రిని స్మృతి చేయాలి. మొత్తం ప్రపంచమంతటినీ మర్చిపోవాలి.

2. తండ్రి సమానంగా సర్వుల కళ్యాణకారులుగా అవ్వాలి, లోపాలను తొలగించివేయాలి. స్వయంపై పూర్తి దృష్టిని ఉంచాలి. స్వయం యొక్క రిజిస్టరును స్వయమే చూసుకోవాలి.

వరదానము:- సర్వ ప్రాప్తుల ఖజానాలను స్మృతి స్వరూపులై కార్యములో వినియోగించే సదా సంతుష్ట ఆత్మా భవ

సంగమయుగము యొక్క విశేష వరదానము సంతుష్టత మరియు సంతుష్టతకు బీజము సర్వ ప్రాప్తులు. అసంతుష్టతకు బీజము స్థూల లేక సూక్ష్మ అప్రాప్తి. బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అన్న వస్తువే లేదు అన్నది బ్రాహ్మణుల గాయనము. పిల్లలందరికీ ఆ ఒక్కరి ద్వారా ఒకే విధమైన తరగని ఖజానా లభిస్తుంది. కేవలం ఆ ప్రాప్తించిన ఖజానాలను అన్నివేళలా కార్యములో వినియోగించండి అనగా స్మృతి స్వరూపులుగా అవ్వండి. అనంతమైన ప్రాప్తులను హద్దులోకి పరివర్తన చెయ్యకండి, అప్పుడు సదా సంతుష్టంగా ఉంటారు.

స్లోగన్:- ఎక్కడైతే నిశ్చయము ఉంటుందో, అక్కడ విజయము యొక్క భాగ్యరేఖ మస్తకముపై ఉండనే ఉంటుంది.